క్లుప్తంగా

అంగన్‌వాడీలో అన్నప్రాసన

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో గల అంగన్‌వాడీ-2 కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ కవిత ఆధ్వర్యంలో అన్నప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలతలు హాజరై పిల్లల తల్లిదండ్రులతో కలిసి పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు స్వప్న, సునీత, ఏఎన్‌ఎంలు సునీత, ఆశవర్కర్లు లక్ష్మి, సంకీర్తన, రజినీ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మనోప్రగతి క్యాంపు ప్రారంభం



మాట్లాడుతున్న ఏపీఎం భగవంతు

కేశంపేట: మానసిక దివ్యాంగుల పునఃరావస కేంద్రంలో నిర్వహించే మనోప్రగతి క్యాంపును అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం భగవంతు అన్నారు. మండల కేంద్రంలోని మానసిక దివ్యాంగుల కేంద్రంలో ప్రతి నెలలో రెండుసార్లు మనోప్రగతి క్యాంపును నిర్వహిస్తారు. అందులో భాగంగా బుధవారం నిర్వహించిన మనోప్రగతి క్యాంపును ఏపీఎం భగవంతు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు ప్రభుత్వం అనేక సదుపాయాలను కల్పించిందన్నారు. బుద్ధిమాద్యం కలిగిన వారికి జిల్లా నుంచి స్పీచ్ థెరపిస్టులు వచ్చి సూచనలు, సలహాలను అందిస్తారని తెలిపారు. ప్రభుత్వం అందించే సదరం సర్టిఫికేట్‌లో 50 శాతం వికలత్వం ఉన్న వారికే పరికరాలను, కిట్లను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెషనల్ స్పీచ్ థెరపిస్టు సురక్షిత, సీసీ నర్సింహా, అనిత, వసంత పాల్గొన్నారు.

నూతన సీఐ, ఎస్‌ఐలను కలిసిన కాంగ్రెస్ నాయకులు



సీఐ భూపాల్‌శ్రీధర్, ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డిలతో నాయకులు

చేవెళ్ల: ఇటీవల చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు బదిలీలపై కొత్తగా వచ్చిన సీఐ భూపాల్‌శ్రీధర్, ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డిలను కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. బుధవారం చేవెళ్లలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ, ఎస్‌ఐలను కలిసిన వారు వారికి శాలువాలు కప్పి స్వాగతం తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మండల కార్యదర్శి గుండాల రాములు, ఉపాధ్యక్షుడు పాండుయాదవ్, యూత్ మండల అధ్యక్షుడు మద్దెల శ్రీను, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాజశేఖర్, నర్సింలు, తదితరులు ఉన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తహసీల్దార్‌కు బీజేవైఎం నాయకుల వినతి

కేశంపేట: నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ బీజేవైఎం నాయకులు మండల కేంద్రంలో తహసీల్దార్ అజీం అలీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర నాయకుడు కంచుకోట మహేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 25వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలన్నారు. పోలీస్ ఉద్యోగాల్లో జీఓ 46ను వెంటనే రద్దు చేయాలని కోరారు. గ్రూప్-2లో అదనంగా పోస్టులను చేర్చాలని డిమాండ్ చేశారు. జాబ్ కేలండర్‌ను విడుదలచేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నర్సింహాయాదవ్, రమేశ్‌రెడ్డి, యుగేందర్, నరేందర్‌రెడ్డి, భక్తవత్సాల్, శ్రీహరి, వీరేందర్‌నాయక్ పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ శోభ



కార్యాలయ ప్రారంభోత్సవంలో చైర్మన్ శోభ, బ్యాంక్ అధికారులు

శంకర్‌పల్లి: ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించేందుకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు కృషి చేస్తోందని ఆ బ్యాంక్ చైర్మన్ వై.శోభ అన్నారు. మండలంలోని మీర్జాగూడ శాఖ బ్యాంక్‌కు నూతన భవన కార్యాలయాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ఖాతాదారులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ సయ్యద్ యూసుఫ్, బ్రాంచ్ మేనేజర్ కె.అశోక్, మాజీ సర్పంచ్ రవీందర్‌గౌడ్, ఉపసర్పంచ్ కిషన్‌సింగ్, ఐకేపీ ఏపీఎం భీమయ్య, బ్యాంక్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షణక్షణం.. భయం భయం!

- శిథిలావస్థలో అప్పారెడ్డిగూడ అంగన్‌వాడీ భవనం
- ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి
- బిక్కుబిక్కుమంటున్న చిన్నారులు, సిబ్బంది



అంగన్‌వాడీ కేంద్రం కొనసాగే భవనం



ఇరుగు గదిలో చిన్నారులకు బోధన

నందిగామ: పూర్తిగా శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం. ఆ భవనానికి ఆనుకొని ఉన్న అంగన్‌వాడీ భవనం కూడా శిథిలావస్థలోనే ఉంది. ఏ క్షణంలో ఏ భవనం కూలుతుందో తెలియని అయోమయ పరిస్థితి. ఆ భవనంలోనే 27 మంది చిన్నారులు. వారికి అందులోనే అంగన్‌వాడీ టీచర్ బిక్కుబిక్కుమంటూ చిన్నారులకు అక్షరాలు నేర్పిస్తోంది.

సౌకర్యాల లేమితో ఇబ్బంది..

మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీలలో 33 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. అందులో 07 నెలల వయస్సు నుంచి 5 ఏళ్లలోపు పిల్లలు 2,118 మంది ఉన్నారు. అప్పారెడ్డిగూడలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో 27 మంది చిన్నారులు ఉన్నారు. అప్పారెడ్డిగూడలో గతంలో ప్రాథమిక పాఠశాలగా కొనసాగిన ఈ భవనానికి ఆనుకొని ఓ గదిలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో గ్రామ సమీపంలో గల ఓ వెంచర్‌లో నూతనంగా నిర్మించిన భవనంలోకి పాఠశాలను కొన్నేళ్ల క్రితమే మార్చారు. దీంతో శిథిలావస్థకు చేరిన పాత భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ భవనానికి ఆనుకుని మరింత శిథిలావస్థకు చేరిన గదిలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుండటంతో ఏ క్షణంలో ఏ భవనం కూలుతుందోనని, ఏ ప్రమాదం పొంచి ఉందోనని అంగన్‌వాడీ టీచర్, చిన్నారులు భయాందోళనలకు గురవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో వంట గది లేదు. చిన్నారులకు ప్రభుత్వం నుంచి ఆటలాడుకునేందుకు సామగ్రి ఇచ్చారు. కానీ ప్లే గ్రౌండ్ లేకపోవడంతో ఆ గదిలోనే ఓ మూలకు ఆ సామగ్రిని పెట్టేశారు. దీంతో ఆ సామగ్రి నిరుపయోగంగానే ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రంలో నల్లా కనెక్షన్ ఉంది. కానీ నీరు నిల్వ పెట్టుకునేందుకు ట్యాంకు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభమయ్యే సమయానికి నల్లా బంద్ అవుతోంది. దీంతో నల్లా ఉన్నా కూడా నిరుపయోగంగానే ఉంది. దీంతో చిన్నారులు వాష్‌రూమ్‌కు వెళ్లలేని దుస్థితి. అంగన్‌వాడీ కేంద్రం పాఠశాల భవనం ఆవరణలోనే ఉండటం, ఆ పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరిపోవడంతో అసాంఘీక కార్యకాలాపాలాకు అడ్డాగా మారింది. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్త చెదారాలతో నిండిపోవడం, దీనికి తోడు అంగన్‌వాడీ గదిలో గుడ్లు ఉండటంతో పాములు వస్తున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని కూల్చివేసి, ఆ స్థలాన్ని పిల్లలు ఆడుకోవడానికి కేటాయించి, అంగన్‌వాడీ కేంద్రానికి కావాల్సిన మరమ్మతులు చేయడంతో పాటు కనీస సౌకార్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పాత భవనాన్ని కూల్చివేయండి



పూర్తిగా శిథిలావస్థకు చేరి, నిరుపయోగంగా, ప్రమాదకరంగా ఉన్న పాఠశాల భవనాన్ని కూల్చివేసి ఆ స్థలాన్ని అంగన్‌వాడీ పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలముగా మార్చాలి. ఆ భవనం అలాగే ఉన్నట్లయితే ఏ క్షణంలో ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలియదు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రంలో కావాల్సిన కనీస సౌకర్యాలు కల్పించినట్లయితే చిన్నారుల సంఖ్య మరింత పెంచుకునేందుకు అవకాశం ఉంది.

–జానకీ, అంగన్‌వాడీ టీచర్, అప్పారెడ్డిగూడ

అందరి సహకారంతోనే అభివృద్ధి

- షాబాద్ మండల సమావేశంలో ఎంపీపీ కోట్ల ప్రశాంతి
- ఎంపీటీసీలకు ఘన సన్మానం, జ్ఞాపికల అందజేత



ఎంపీపీ కోట్ల ప్రశాంతి మహేందర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎంపీడీఓ అపర్ణ, ఎంపీటీసీలు

షాబాద్: ఐదు సంవత్సరాలు అందరి సహాయ సహకారాలతోనే పార్టీలకతీతంగా మండల అభివృద్ధికి ఎంతో కృషి చేసినట్లు షాబాద్ ఎంపీపీ కోట్ల ప్రశాంతి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కోట్ల ప్రశాంతి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ముగిసిన అనంతరం ఎంపీటీసీలు, ఎంపీపీల పదవీ కాలం ఈ నెల 4వ తేదీతో ముగుస్తుండడంతో ఈ సందర్భంగా ఎంపీపీ కోట్ల ప్రశాంతి మహేందర్‌రెడ్డి దంపతులను ఎంపీటీసీలు ఘనంగా సన్మానించారు.

గ్రామాల్లో ప్రజా సమస్యలపై చర్చ..

ముందుగా నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండలంలో పలు అభివృద్ధి పనులు, చేయాల్సిన పనులపై ఆయా శాఖల వారీగా చర్చించారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి నిధులు విడుదల చేయాలని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం విద్యుత్ సమస్యలతో గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని త్వరగా పరిష్కరించాలని పలువురు సభ్యులు విన్నవించారు. విద్యుత్ ఏఈ నరేందర్‌నాయక్ మాట్లాడుతూ.. తమ వద్దకు వచ్చిన విద్యుత్ సమస్యలను పరిష్కరించామని, ఇక నుంచి ఇబ్బందులు ఉండవన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి ముందుస్తుగా సమాచారం అందించి మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అందిస్తున్న రాయితీ రైతు భరోసా బీమా రైతులందరికీ అందించేలా చూడాలని పలువురు సభ్యులు కోరారు. ఆయా శాఖల వారీగా అధికారులు అభివృద్ధి పనులను వివరించారు. ఎంపీడీఓ అపర్ణ మాట్లాడుతూ.. ఐదేళ్ల పదవీ కాలంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులందరి సహకారంతోనే మండల అభివృద్ధి పనులు చేశామన్నారు. పార్టీలు వేరువేరుగా ఉన్నా మండలంలోని ప్రజాప్రతినిధులందరూ అభివృద్ధి కోసం కలిసిమెలసి పనిచేశారన్నారు. ఇదే స్ఫూర్తితో అందరూ పనిచేయాలని సూచించారు. ఎంపీపీ కోట్ల ప్రశాంతి మహేందర్‌రెడ్డి దంపతులను ఎంపీటీసీలందరికీ మెమోంటోలను అందించి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. పలువురు ఎంపీటీసీలు ఎంపీపీ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జడల లక్ష్మిరాజేందర్‌గౌడ్, ఎంపీడీఓ అపర్ణ, ఎంఈఓ శంకర్‌రాథోడ్, ఎంపీఓ హన్మంత్‌రెడ్డి, అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, మల్లేశ్, అశోక్, కరుణాకర్, జయమ్మ, లత, సరళ, పార్వతమ్మ, సునీత, వనిత, కో–ఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎంపీపీ, ఎంపీటీసీలకు జ్ఞాపికలు అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఎంపీటీసీల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీలను శాలువాలతో ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పంచాయతీరాజ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళలకు రిజర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థల్లో ప్రాధాన్యత కల్పించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తూ పాలన సాగిస్తుందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తుందన్నారు. అంతకుముందు మల్లాపూర్ తండాలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, వైఎస్ ఎంపీపీ శోభ, జే. సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, రాంరెడ్డి, హరినాథ్‌రెడ్డి, ప్రభాకర్, సత్యనారాయణ, ఎంపీటీసీలు ప్రసన్నలత, కృష్ణ, రవీందర్‌రెడ్డి, సత్యమ్మ, అంజమ్మ, ఢాకీ, రాజేందర్‌గౌడ్, కో–ఆప్షన్ సభ్యుడు విజయపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఘనంగా సన్మానం

షాద్‌నగర్‌రూరల్: పదవీ విరమణ పొందనున్న ఫరూఖ్‌నగర్ జెడ్పీటీసీ, ఎంపీటీసీలను బుధవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి, ఎంపీపీ ఖాజాఇద్రీస్ అహ్మద్‌లతో పాటు ఎంపీటీసీలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీశైలం, భీష్వరామకృష్ణ, భార్గవ్‌కుమార్, మౌనిక, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలను బలోపేతం చేస్తాం

నందిగామ: గత పాలకులు స్థానిక సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేశాయని, కాంగ్రెస్ పాలనలో స్థానిక సంస్థలను బలోపేతం చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో ఎంపీపీ ప్రియాంక అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సభ్యులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలంటే స్థానిక సంస్థలు బలంగా ఉండాలన్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు కేవలం పదవులకు మాత్రమే విరమణ అని, భవిష్యత్‌లో మరింత ఉన్నత పదవులలో కొనసాగాలని సూచించారు. పదవీ విరమణ పొందుతున్న ఎంపీపీ ప్రియాంకతో పాటు వైస్ ఎంపీపీ మంజుల, ఎంపీటీసీలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కాట్న లత, కలమ్మ, కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, మాధవి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహాయాదవ్, తుల సీరాంనాయక్, ఎంపీడీఓ సుమతి, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



సీసీరోడ్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మొయినాబాద్: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లిలో నిర్మించిన సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాధాన్యతను బట్టి అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు రాబట్టే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, ఎంపీటీసీలు శ్రీనివాస్, మల్లేశ్, అంజయ్య, నాయకులు జీవంత్, గణేశ్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి

కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినబాక ప్రభాకర్



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న కార్మికులు

షాద్‌నగర్: కార్మిక సంక్షేమానికి తాము నిరంతరం కృషి చేస్తామని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినబాక ప్రభాకర్ అన్నారు. మెకానిక్ దినోత్సవాన్ని బుధవారం షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్మికులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పినబాక ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మెకానిక్‌ల సంక్షేమానికి ఎలాంటి సహాయ సహకారాలు అందించడం లేదన్నారు. అయినా కార్మికులందరూ ఐక్యంగా ఉండి ముందుకు సాగడం హర్షణీయమన్నారు. షాద్‌నగర్‌లో గత 14 ఏళ్ల క్రితం ఏర్పాటైన టూ వీలర్స్ మెకానిక్ సంక్షేమ సంఘం ఎన్నో ఇబ్బందులను అధికమించిందని తెలిపారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా సంఘం ముందుకు సాగుతోందన్నారు. షాద్‌నగర్ సంఘాన్ని ఆదర్శంగా తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా మెకానిక్‌లు సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బంటారం సుధాకర్‌గౌడ్, భాస్కర్, కుమార్, అశోక్‌రెడ్డి, నర్సింలు, శ్రీను, రాజేశ్, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

షాద్‌నగర్: తమ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం సమగ్ర శిక్షణ అభియాన్ ప్రాజెక్టులో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు మాట్లాడుతూ.. విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టులో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, పీటీఐలు, ఐఆర్‌పీలు, మెసేంజర్లు, మోడల్ పాఠశాలలోని హాస్టల్‌లో పనిచేస్తున్న కేర్‌టేకర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యాభివృద్ధికి కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం తమకు మినిమం టైం స్కేల్‌ను అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పాండు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలతో పేదలకు మేలు

ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి



ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చేవెళ్ల: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలు పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముడిమ్యాల గ్రామంలో బుధవారం పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రతాప్‌రెడ్డి, గ్రామ నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఇలాంటి ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించాలని కోరారు. నిరుపేద కుటుంబాలకు చెందిన ప్రజలు, వృద్ధులు ఆస్పత్రులకు వెళ్లి చూపించుకోలేని పరిస్థితుల్లో ఉంటారని అలాంటి వారికి ఈ శిబిరాలు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రి సిబ్బందిని అభినందించారు. ఈ శిబిరంలో ప్రజలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది, గ్రామ నాయకులు ప్రభాకర్, రాములు, శ్రీనివాస్‌గౌడ్, మాధవరెడ్డి, వాజీద్, ఖాజామోహినోద్దీన్, సాయినాథ్, రాజీకుమార్, నర్సింలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు రైతుబంధుపై అభిప్రాయాల సేకరణ

కొందుర్గు: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో గురువారం ఉదయం 10 గంటలకు రైతుబంధు విధివిధానాల అమలుపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఉంటుందని పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారని, కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని అన్ని గ్రామాల రైతులు హాజరై తమ అభిప్రాయాలను తెలపాలని కోరారు.

స్వదేశీ స్వావలంబన జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాస్

కేశంపేట: స్వదేశీ స్వావలంబన జిల్లా కన్వీనర్‌గా మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన పాలాది శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని కేశవ మెమోరియల్ ఇంజినీరింగ్ కళాశాలలో స్వదేశీ స్వావలంబన రాష్ట్ర మహాసభలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రముఖ్ జగదీశ్వర్, తెలంగాణ రాష్ట్ర కో-కన్వీనర్ ఈశ్వర్, విభాగ్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పాలాది శ్రీనివాస్‌కు నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్వదేశీ నినాదాన్ని ఊరు వాడలో ప్రచారం చేస్తామన్నారు. స్వదేశీ వస్తువులను వినియోగించాలని, స్వయం ఆవిష్కరణలవైపు యువత నడవాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

మొయినాబాద్‌రూరల్: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కేతిరెడ్డిపల్లి ఎంపీటీసీ అర్చనయాదయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో రూ.14లక్షలతో చేపట్టనున్న మురుగు కాల్వ నిర్మాణం, సీసీరోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. అదేవిధంగా రూ.5లక్షలతో డ్వాక్రా భవనం, అంగన్‌వాడీ భవన మరమ్మతు పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తారాబాయి, మాజీవార్డుసభ్యులు రజ్వానా, హన్మంత్‌రెడ్డి, గ్రామస్తులు కృష్ణ, కుమార్, శ్రీనివాస్, సుధాకర్, మహేందర్, నర్సింహ్మారెడ్డి, మల్లేశ్, రాములు, భిక్షపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన జెడ్పీటీసీ



కేటీఆర్‌తో జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, తదితరులు

షాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి కలిశారు. బుధవారం నగరంలోని ఆయన నివాసంలో పార్టీ శ్రేణులతో కేటీఆర్‌ను అవినాశ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ...పార్టీలో కష్టపడి పనిచేసే నాయకులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో చేవెళ్ల నియోజకవర్గం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందినట్లు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గూడూరు నర్సింగ్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు కార్తీక్‌రెడ్డి, క్యామ మల్లేశ్, కొలన్ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ రాంరెడ్డి

మొయినాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎంపీటీసీ పట్నం రాంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని శ్రీరాంనగర్‌లో సీసీరోడ్డు నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీరోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య, మాజీ ఎంపీటీసీ మాధవరెడ్డి, నాయకులు మల్లేశం, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, భిక్షపతి, ప్రభాకర్, డేవిడ్, మహేందర్, విఠల్, రాఘవులు, భరత్, మల్లేశ్, మహిపాల్, ప్రవీణ్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మరమ్మతులు చేయొద్దు

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్

షాబాద్: విద్యుత్ ప్రమాదాల నుంచి రైతాంగం అప్రమత్తంగా ఉండాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఉబ్బగుంట గ్రామానికి చెందిన మోత్కూరి సాయన్న కుటుంబాన్ని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డితో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాద కారణంగా పశువులు మరణిస్తే ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.40వేల రూపాయలు ప్రతి పశువుకు ఇస్తుందన్నారు. దాని కోసం కావాల్సిన పత్రాలను విద్యుత్‌శాఖ అధికారులకు అందించాలని సూచించారు. విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులను రైతులు చేయొద్దన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యానారాయణరెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు మల్లయ్య, చంద్రబాబు ఉన్నారు.



మోత్కూరి సాయన్నను పరామర్శిస్తున్న గజేందర్‌గౌడ్